సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 30 । మార్చి । 2025



సోమశిలలో 53.610 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం 53.610 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1080 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.




బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.92,400
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,360
3శాతం జీఎస్టీతో	రూ.8,611
నవర (8గ్రా)	రూ.68,888

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.0 /26.2

జిల్లాలో వాతావరణం ఆదివారం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 48 శాతంగా నమోదైంది.



న్యూస్‌రీల్

ఐటీఐ కళాశాల భవన పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్


సంగం: మండలంలోని అమరపునాయుడుకండ్రికలో ఐటీఐ కళాశాల కోసం కేటాయించిన ల్యాంకో ఫౌండేషన్ బిల్డింగ్‌ను కలెక్టర్ ఓ ఆనంద్ శనివారం పరిశీలించారు. బిల్డింగ్ మ్యాప్‌ను పరిశీలించి నిర్మాణాలు, తరగతి గదులకు అనువుగా ఉన్నాయా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కళాశాల రాకపోకలకు రోడ్డు సౌకర్యాన్ని పరిశీలించారు. పనులు ప్రారంభించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సోమ్లానాయక్, ఎస్సై రాజేష్, టీడీపీ నేత బాణా శ్రీనివాసులరెడ్డి, సర్వేయర్లు పాల్గొన్నారు.

గోడౌన్ గుట్టు మిస్టరీ

పౌరసరఫరాల శాఖ కావలి గోడౌన్‌లో బియ్యం మాయం గుట్టు మిస్టరీగా ఉంది. ఆశాఖ ఇంటి దొంగలు, అధికార పార్టీ నేతలు కలిసి పేదల బియ్యాన్ని బొక్కేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంత కాలంగా బియ్యం దొడ్డి దారిన తరలిపోతున్నా అధికార యంత్రాంగం పసిగట్టలేకపోయింది. ఈ విషయం వెలుగు చూసి ఐదు రోజులకుపైగా అవుతోంది. కానీ గల్లంతైన బియ్యం లెక్క తేల్చ లేకపోతున్నారంటే ఆ లెక్క అంచనాలకు మించి ఉండొచ్చని అనుమానాలు బలపడుతున్నాయి.

- భారీ స్థాయిలో రేషన్ బియ్యం మాయం?
- ఆరు నెలలుగా జరుగుతున్న తంతు
- బస్తాల లెక్క తగ్గించడానికే.. ఐదు రోజులుగా తేల్చని వైనం
- కంప్యూటర్ ఆపరేటర్‌పై డీటీ ఆరోపణలు
- స్టాక్ 'కీ'లకదారుడు డీటీపైనే అనుమానాలు
- అంతర్గత విచారణకు జాయింట్ కలెక్టర్ ఆదేశాలు
- ఈ వ్యవహారంలో కేసు నమోదుకు తర్జనభర్జనలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక స్థానిక ఎమ్మెల్యేల దృష్టి రేషన్ బియ్యం దందాపై పడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆ పార్టీ నేతలు పౌరసరఫరాల శాఖ గోడౌన్ నుంచే బియ్యం అక్రమ రవాణాకు తెగబడుతున్న పరిస్థితులు తరచూ వెలుగు చూస్తున్నాయి. తాజాగా పౌరసరఫరాల శాఖ కావలి గోడౌన్‌లో భారీ స్థాయిలో బియ్యం గల్లంతయిన విషయంలో ఇంటి దొంగల పాత్రతోపాటు అధికార పార్టీ నేతల పాత్రపైనా అనుమానాలు ఉన్నాయి. గోడౌన్‌లో పెద్ద మొత్తంలో బియ్యం మయం అయిన విషయం వెలుగు చూసి దాదాపు ఐదు రోజులు దాటింది.



900 బస్తాలేనా? అంతకు మించేనా?

కావలి గోడౌన్‌లో దాదాపు 900 బస్తాల బియ్యం తేడాలున్నట్లు ప్రాథమికంగా అంచనాగా చెబుతున్నారు. కానీ ఐదు రోజులుగా అంతర్గత విచారణ జరపడంలోనే ఏదో ఆంతర్యం ఉన్నట్లు స్పష్టమవుతోంది. అంతర్గత విచారణలో తవ్వేకొద్దీ నిగూఢ రహస్యాలు బయట పడుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ 900 బస్తాలే కాదు.. అంతకు మించి భారీగా బియ్యం కొన్ని నెలల కాలంలో గల్లంతైనట్లు వెలుగు చూస్తున్నాయని సమాచారం. స్థానిక డీటీ అక్కడ పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్ సహకారంతో బియ్యం బస్తాలు మాయం చేశాడని సివిల్ సప్లయిస్ శాఖ అధికారులు కావలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఎస్పీ దృష్టికి తీసుకురాగా ఆయన జేసీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేయకుండా ఇలా మంతనాలు జరపడం చూస్తుంటే బియ్యం గల్లంతు భారీ మొత్తంలో జరిగి ఉండాలి, లేదా అధికార పార్టీ నేతల పాత్ర అయినా ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇంకా అంతర్గత విచారణ పేరుతో రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తున్నారు. ఇక పోలీస్ శాఖ సైతం ఈ వ్యవహారంపై కేసు నమోదుకు తర్జనభర్జనలు పడుతోంది. ఎవరిపై కేసు నమోదు చేయాలి, ఎంత మేర స్టాక్ గల్లంతైనట్లు చూపించాలనే విషయంలో రెవెన్యూ, పోలీస్ శాఖలు మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నాయి. జరుగుతున్న విచారణ తంతు చూస్తే చివరకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై నెట్టేసి ఈ కేసును మూసివేసే పనిలో ఉన్నారనే ప్రచారం కూడా జరుగుతోంది.

కూటమి దందా.. అధికారుల అండ

కూడమి ప్రభుత్వంలో పేదల బియ్యాన్ని అడ్డగోలు దోపిడీకి ఎంచుకున్నారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక్కో వ్యాపారి చేతికి అప్పగించారు. వారే డీలర్ల వద్ద బియ్యం సేకరణ చేసి రైస్‌మిల్లుల్లో పాలిష్ చేసి చెన్నై మార్కెట్‌కు తరలించడంతోపాటు కృష్ణపట్నం పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమతులు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రేషన్ దందా నిర్వహించుకునేందుకు స్థానిక ఎమ్మెల్యేకు నెలకు రూ.25 లక్షల వంతున కప్పం కడుతున్నట్లు సమాచారం. పేదల బియ్యం దందాను అడ్డుకోవాల్సిన సివిల్ సప్లయిస్ శాఖ అధికారులు సైతం మాఫియాకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కావలి గోడౌన్‌లో బియ్యం మాయం ఘటనే ఇందుకు ఉదాహరణగా చూపొచ్చు. ఆరు నెలలుగా కావలిలోని మద్దూరుపాడులో ఉన్న సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ గోడౌన్‌లో ఉండాల్సిన బియ్యాన్ని ఇంటి దొంగలే మాయం చేసినట్లు వెలుగులోకి వచ్చింది. కంప్యూటర్ ఆపరేటర్ ఈ అక్రమాలకు పాల్పడ్డారని డీటీ నెపం వేస్తున్నట్లు సమాచారం. అయితే స్టాక్ 'కీ'లో కీలకదారుడు డీటీ కావడంతో ఆయనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బరితెగించిన అధికారులు

పౌర సరఫరాల శాఖ అధికారులు బరితెగిస్తున్నారు. గోడౌన్ నుంచే పేదలకందాల్సిన బియ్యాన్ని మాఫియాలకు అమ్ముకునే స్థాయికి వెళ్లారు. ఇటీవల కందుకూరులో కూడా గోడౌన్‌లో స్టాక్‌లో తేడాలొచ్చాయి. అక్కడ పనిచేసే అధికారి రేషన్‌బియ్యం మాఫియా కనుసన్నల్లో పనిచేస్తున్నాడనే ఆరోపణలున్నాయి. వలేటివారిపాళెం మండలంలోని ఓ రేషన్ దుకాణంలో పేదలకు ఇవ్వకుండా బస్తాలనే మాఫియాకు అమ్ముకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. మామూళ్లకు కక్కుర్తిపడి పేదల కడుపులు మాడ్చేసి తమ బొజ్జలు నింపుకుంటున్న అధికారులపై ఉన్నతాధికారులు చర్యలకు వెనుకాడుతున్నారు. ఆ పాపపు సొమ్ములో ఉన్నతాధికారులకు వాటాలుండడంతోనే కిందిస్థాయి అధికారులు బరితెగించి పోతున్నారన్న ఆరోపణలున్నాయి.

నివేదికలు అందిన వెంటనే చర్యలు

"ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ బియ్యం అక్రమంగా తరలించారనే విషయంపై విచారణ జరుగుతోంది. కావలి ఆర్‌డీఓ విచారణ చేపడుతున్నారు. దీనికి సంబంధించి నివేదికలు అందిన తర్వాత సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

– అర్జున్‌రావు, సివిల్ సప్లయ్స్ డీఎం

గత టీడీపీ ప్రభుత్వం నుంచి..

గత టీడీపీ ప్రభుత్వం నుంచి సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డీఎం కార్యాలయం అవినీతికి కేరాఫ్‌గా మారిపోయింది. 2017 నుంచి 2022 వరకు దాదాపు రూ.40 కోట్ల నిధులు దుర్వినియోగం చేసి అవినీతి సొమ్మును పంచుకున్నట్లు జిల్లా అధికారుల విచారణలో తేలింది. ఈ వ్యవహారాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏసీబీకి అప్పగించడంతో ఈ కుంభకోణంలో కీలకంగా ఉన్న 11 మందిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. కాగా ఈ మొత్తం వ్యవహారంలో 32 మందికి ప్రత్యక్ష సంబంధాలున్నట్లు తేల్చి జైళ్లకు పంపారు. తాజాగా టీడీపీ ప్రభుత్వం రాగానే మరోసారి బరి తెగిస్తున్నారు.

కామాక్షితాయి సేవలో హైకోర్టు న్యాయమూర్తి దంపతులు



కామాక్షితాయికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి దంపతులు

బుచ్చిరెడ్డిపాళెం: ప్రముఖ పుణ్యక్షేత్రం జొన్నవాడలోని మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే శ్రీనివాస్‌రెడ్డి దంపతులు శనివారం దర్శించుకున్నారు. జస్టిస్ కే శ్రీనివాస్ రెడ్డి దంపతులకు ఆలయ మర్యాదలతో ఈఓ శ్రీనివాసులురెడ్డి, అర్చకులు స్వాగతం పలికారు. న్యాయమూర్తి దంపతులు ఆలయంలోని స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లికార్జునస్వామి వారికి సహస్రనామార్చన, కామాక్షితాయి అమ్మవారికి ఖడ్గమాల, లక్ష్మీగణపతి స్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి అష్టోత్తర శతనామావళి అర్చనలు ఆలయ అర్చకులు నిర్వహించారు. న్యాయమూర్తి శ్రీనివాసరెడ్డి దంపతులను శేష వస్త్రాలతో సత్కరించి శ్రీవార్ల చిత్రపటం, తీర్థ ప్రసాదాలతోపాటు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయస్థాన అధికారులు, జిల్లా పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వకంగా..

నెల్లూరు (బారకాసు): డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ పి.సంపత్‌కుమార్ శనివారం నెల్లూరు విచ్చేశారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో డాక్టర్ పి.సంపత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

మే నెలాఖరుకు తల్లికి వందనం

- మంత్రి పొంగూరు నారాయణ



జాకీర్‌హుస్సేన్ నగర్‌లోని పార్కును పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు సిటీ: ఈ ఏడాది మే నెలాఖరులోగా తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంత మంది చదువుతున్న పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేల చొప్పున అందిస్తామని, ఎన్టీఆర్ రైతు భరోసా కింద రైతులకు రూ.20 వేలు అందిస్తామని మంత్రి నారాయణ చెప్పారు. నగరంలోని 5వ డివిజన్ సత్యనారాయణపురంలో శనివారం మంత్రి రంజాన్ తోఫా పంపిణీ చేశారు.

పార్కులు అభివృద్ధి చేస్తాం

నగరంలోని మైపాడు గేట్, నవాబుపేట, కుసుమహరిజనవాడ, పద్మావతి గ్రీన్‌సిటీ, యలమవారిదిన్నె, బలిజపాళెం తదితర ప్రాంతాల పార్కుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం మంత్రి నారాయణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రీన్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలను అత్యున్నతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఎన్టీ ఆర్ సుజల స్రవంతి పథకాన్ని పునరుద్ధరించి పట్టణాల్లో రూ.2లకే 20 లీటర్ల తాగునీరు అందిస్తామని తెలిపారు. 4వ డివిజన్‌లోని జాకీర్ హుస్సేన్‌నగర్ పార్క్‌కు రెండు వైపులా అనువైన ఖాళీ స్థలాన్ని గుర్తించామని, వాటిలో షటిల్, వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

కలెక్టర్ ఉగాది శుభాకాంక్షలు

నెల్లూరురూరల్: తెలుగు సంవత్సరం విశ్వావసు నామ ఉగాది సందర్భంగా జిల్లా ప్రజలకు కలెక్టర్ ఆనంద్ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు ప్రజల సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పవిత్రమైన పండగ ఉగాది అని, జిల్లా ప్రజలందరికి ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు అందించాలని ఆకాంక్షించారు. జాయింట్ కలెక్టర్ కె కార్తీక్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఉగాది వేడుకలు

శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలోని శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. వేద పండితుల ఆశీర్వచనాలు, నాదస్వరం, పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం, ఉగాది పురస్కారాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో తెలుగు సంవత్సరాది ఉగాదిని ఘనంగా నిర్వహించే ఈ వేడుకల్లో అందరూ పాల్గొనాలన్నారు.

జిల్లా ప్రజలకు ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు



నెల్లూరు(క్రైమ్): జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది, రంజాన్ పర్వదినాల శుభాకాంక్షలను ఎస్పీ జి. కృష్ణకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. షడ్రుచుల ఉగాది పచ్చడి మాదిరిగానే పోలీసు ఉద్యోగి జీవితమని వాటిని ధైర్యంగా సమయ స్ఫూర్తితో అధిగమించినప్పుడే ఆనందాలు పొందవచ్చని తెలిపారు. పవిత్ర రంజాన్ పండగను ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు రూరల్: హైకోర్టు న్యాయమూర్తి, నెల్లూరు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి శ్రీనివాసరెడ్డిని నగరంలోని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో కలెక్టర్ ఆనంద్ మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు.

కూలీల సంఖ్యను పెంచండి



మాట్లాడుతున్న గంగాభవాని

నెల్లూరు (పొగతోట): ఉపాధి హామీ పథకానికి హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచాలని డ్వామా పీడీ గంగాభవాని ఆదేశించారు. నగరంలోని డ్వామా కార్యాలయం నుంచి మండల సిబ్బందితో శనివారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. పనులు జరిగే ప్రాంతంలో నీడ కోసం చిన్నపాటి పందిళ్లను వేయాలని సూచించారు. ఆడిట్ ప్రక్రియ జరుగుతున్న తరుణంలో కూలీల సంఖ్య తగ్గిందని, నిర్దేశించిన లక్ష్యాలను ఈ నెలాఖరులోపు నూరు శాతం పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన దినసరి వేతనం లభించేలా చర్యలు చేపట్టాలన్నారు.

64 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

నెల్లూరు రూరల్: జిల్లాలో ఏర్పాటు చేసిన పీపీసీల ద్వారా ఇప్పటివరకు 64 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని జేసీ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. తాజాగా శనివారం 6893 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని వివరించారు. ఇప్పటి వరకు రూ.122 కోట్లను రైతులకు చెల్లించామని వెల్లడించారు.

అడవి పందిని ఢీకొన్న బైక్

• ముగ్గురికి గాయాలు



క్షతగాత్రులు

దుత్తలూరు: అడవి పందిని బైక్ ఢీకొనడంతో ముగ్గురు గాయపడిన ఘటన దుత్తలూరు సెంటర్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. ఉదయగిరి మండలంలోని ఉప్పరపల్లికి చెందిన సునీత, కుమారుడు వెంకటరామ్‌చరణ్, ఆమె తండ్రి బద్దిక సుబ్బరాయుడు వింజమూరు మండలం మోటచింతలపాళేనికి బైక్‌పై బయల్దేరారు. ఈ తరుణంలో దుత్తలూరు సమీపంలో రోడ్డుకు అడ్డంగా అడవి పంది రావడంతో దాన్ని ఢీకొని కిందపడ్డారు. ప్రమాదంలో గాయపడిన వీరిని 108లో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కావలి తీసుకెళ్లారు.

ఉగాదిని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి

నెల్లూరు(బృందావనం): విశ్వావసు ఉగాది సంవత్సరాదిని జిల్లా వాసులు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కాంక్షించారు. ప్రజలకు ఉగాది శుభాకాంక్షలను తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీలో పలువురికి పదవులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగాధ్యక్షులను నియమిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులను శనివారం జారీ చేసింది. కందుకూరుకు మరియపాటి ఆదామ్, నెల్లూరు రూరల్‌కు మోహన్‌రావు, సర్వేపల్లికి కండే ప్రసాద్, ఆత్మకూరుకు తిరుమలరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, గూడూరుకు కలికి జనార్దన్‌రెడ్డి, కోవూరుకు బిట్రగుంట నారాయణ, సూళ్లూరుపేటకు రాజగోపాల్‌ను నియమించారు.

లారీల ఢీ: డ్రైవర్‌కు తీవ్రగాయాలు

పొదలకూరు: లారీలు ఢీకొనడంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడిన ఘటన రాపూరు – పొదలకూరు మార్గంలోని డేగపూడి సమీపంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. సంగం నుంచి తిరుపతికి ఇసుక లారీ వెళ్తుండగా, డేగపూడి కూడలి వద్ద లారీ అడ్డురావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశారు. ఈ క్రమంలో వెనుక వస్తున్న మరో లారీ ఢీకొంది. ఘటనలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. క్యాబిన్‌లో ఇరుక్కున్న ఆయన్ను గ్రామస్తులు బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు.

మనవరాలి జన్మదిన వేడుకలకెళ్లి..

- తిరిగొస్తుండగా ఘోర రోడ్డు ప్రమాదం
- దుర్ఘటనలో ఇద్దరి మృతి
- నలుగురికి గాయాలు



నుజ్జునుజ్జయిన వాహనాలు



విగతజీవులుగా వీరబ్రహ్మం, కొండమ్మ

వరికుంటపాడు: మనవరాలి జన్మదిన వేడుకలను కుటుంబసభ్యులతో కలిసి ఉత్సాహంగా జరుపుకొని, తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా చోటుచేసుకున్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, నలుగురు గాయపడిన ఘటన వరికుంటపాడు పోలీస్‌స్టేషన్ సమీపంలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్సై రఘునాథ్ వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పెద్దచెర్లోపల్లి మండలం పెద్దబొట్టుపల్లికి చెందిన బట్టి యోగయ్య, కొండమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలున్నారు. ఈ క్రమంలో కలువాయి మండలం చీపినాపిలో ఉన్న రెండో కుమార్తె కూతురి మొదటి జన్మదిన వేడుకలకు తన కుటుంబసభ్యులతో కలిసి కారులో శుక్రవారం మధ్యాహ్నం వెళ్లారు. అక్కడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి స్వగ్రామానికి తిరిగి శనివారం తెల్లవారుజామున బయల్దేరారు. వరికుంటపాడు హైవేపై స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోకి వచ్చేసరికి అనంతపురం జిల్లా కదిరి వెళ్తున్న మినీ బొలెరో.. కారును ఢీకొంది. ఆ సమయంలో అందులో చిన్నారి మినహా మిగిలిన ఆరుగురు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ముగ్గుర్ని ప్రకాశం జిల్లా పామూరుకు, మిగిలిన వారిని ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు 108లో తరలించారు. పామూరు వైద్యశాలలో బోనం వీరబ్రహ్మం (19), ఉదయగిరిలోని ఆస్పత్రిలో బట్టి కొండమ్మ (50) మృతి చెందారు. యోగయ్య, ఆయన కుమార్తెలు పెదయోగమ్మ, చిన్నయోగమ్మ, కారు డ్రైవర్ చొప్పరపు నవీన్ గాయపడ్డారు. మృతదేహాలకు ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలలో పోస్ట్‌మార్టాన్ని నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి బలవన్మరణం

నెల్లూరు(క్రైమ్): రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు సమీపంలో శనివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. మనుబోలుకు చెందిన సాయికృష్ణ (31) కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు సమీపంలో నెల్లూరు వైపు వచ్చే పట్టాలపై వందేభారత్ కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా తయారైంది. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధార్‌కార్డు మేరకు బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై..



నెల్లూరు(క్రైమ్): చదువుపై శ్రద్ధ చూపడం లేదని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. స్టోన్‌హౌస్‌పేటలోని ముగ్గురాళ్ల వీధికి చెందిన శంకరవరప్రసాద్, ఉషారాణి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కొడుకున్నారు. కుమారుడు రామశివశరణ్ (18) ఇటీవల ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు. చదువుపై కొంతకాలంగా నిర్లక్ష్యంగా ఉండటంతో తండ్రి మందలించారు. ఈ క్రమంలో తన కుటుంబంతో కలిసి సరస్వతీనగర్‌లోని నూతన ఇంటికి శంకరవరప్రసాద్ వెళ్లారు. ఈ తరుణంలో గ్యాస్ సిలిండర్ తీసుకొచ్చేందుకు పాత ఇంటికెళ్లిన రామశివశరణ్ ఎంతకీ రాలేదు. కుమారుడికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో ఇంటికొచ్చి చూడగా, హాల్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని వేలాడుతూ ఉండటాన్ని గమనించి బోరున విలపించారు. స్థానికుల సహకారంతో కుమారుడ్ని కిందికి దించి చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. తండ్రి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

విద్యుదాఘాతంతో మహిళ దుర్మరణం



తోటపల్లిగూడూరు: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని వెంకన్నపాళెం పంచాయతీలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై వీరేంద్రబాబు కథనం మేరకు.. మండలంలోని వెంకన్నపాళేనికి చెందిన అక్కయ్యగారి ఆదిలక్ష్మి(34), తన భర్త యాదగిరితో కలిసి స్థానికంగా రొయ్యల గుంతను సాగుచేస్తున్నారు. ఈ క్రమంలో రొయ్యల గుంతలో మేత వేస్తుండగా గట్టుపై ఉన్న కరెంట్ వైర్ ఆమె కాళ్లకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. శవపంచనామా అనంతరం పోస్ట్‌మార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన



కలెక్టరేట్ వద్ద సీపీఎం నేతల ధర్నా

నెల్లూరు(అర్బన్): రాష్ట్రంలో పాలన పడకేసి ప్రజలు నానా తిప్పలు పడుతుంటే, ప్రభుత్వం వారిపై చార్జీల భారాన్ని మోపుతూ నిలువు దోపిడీ చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించడంతో పాటు విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ట్రంక్ రోడ్డు నుంచి కలెక్టరేట్ వద్దకు భారీ ర్యాలీని పార్టీ నేతలు, కార్యకర్తలు శనివారం నిర్వహించారు. అనంతరం అక్కడ చేపట్టిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో చిన్న సమస్యలు సైతం పరిష్కారానికి నోచుకోవడంలేదని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కూలీలకు మూడు నెలలుగా కూలి ఇవ్వలేదన్నారు. పన్నులను విపరీతంగా పెంచారని మండిపడ్డారు. అదానీ కంపెనీకి చెందిన వ్యక్తులే స్మార్ట్ మీటర్లను ఇంటింటికీ అమర్చనున్నారని, ఇదే జరిగితే ప్రభుత్వానికి ఫ్యూజులను ప్రజలు తీయడం ఖాయమన్నారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ ఆస్తులను విక్రయించి రైతులు, ఉద్యోగుల బకాయిలు తీరుస్తామని పేర్కొనడం చంద్రబాబు చేతగానితనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ తరలిపోయిందనే సాకుతో రైతుల ధాన్యానికి ధరలను మిల్లర్లు తగ్గించారని ఆరోపించారు. ధాన్యం పుట్టిని రూ.24 వేలకు విక్రయించాల్సి ఉండగా, రూ.16 వేలకు మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడారు. నెల్లూరును సుందరనగరంగా తీర్చిదిద్దుతామని మంత్రి నారాయణ చెప్పినా, వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. కాగా ధర్నా వద్దకు డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, ఏఓ విజయకుమార్ వచ్చి వారి అర్జీలను స్వీకరించి ప్రభుత్వానికి పంపుతామని హామీ ఇచ్చారు. పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నేతలు చంద్ర రాజగోపాల్, మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, వెంకమరాజు, అల్లాడి గోపాల్, నాగేశ్వరరావు, పెంచలనరసయ్య, కొండా ప్రసాద్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు

పొదలకూరు



పెద్దవి	: రూ.88
సన్నవి	: రూ.60
వండ్లు	: రూ.35

పెదపవనిలో రాష్ట్రస్థాయి నాటక పోటీలు

లింగసముద్రం: మండలంలోని పెదపవనిలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో నాటక పోటీలను నిర్వహించనున్నామని నిర్వాహకుడు మలిశెట్టి నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను రాఘవేంద్రరావు స్మారక కళాపరిషత్, పావని ఆర్ట్స్ ఆధ్వర్యంలో మే 12 నుంచి 15 వరకు నిర్వహించనున్నామని చెప్పారు. ప్రవేశ రుసుముగా రూ.వెయ్యిని మే పదిలోపు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఒక్కో నాటికను 45 నుంచి 60 నిమిషాలు మించకుండా ప్రదర్శించాలన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి నాటక సమాజానికి రూ.20 వేల పారితోషికాన్ని అందజేయనున్నామని వివరించారు. విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.పది వేలతో పాటు షీల్డ్‌ను బహూకరించనున్నామని పేర్కొన్నారు. వివరాలకు 90001 36237, 77807 84083 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కల్తీ ఆహార పదార్థాల విక్రేతలకు జరిమానా

నెల్లూరు రూరల్: కల్తీ, నకిలీ ఆహార పదార్థాల విక్రయదారులకు జరిమానాను జేసీ కార్తీక్ విధించారు. నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయిస్తున్న వ్యాపారులు, తయారీదారులు, హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసి వ్యాపారులపై నమోదు చేసిన కేసులను శనివారం ఆయన విచారించారు. ఈ విచారణలో సంబంధిత వ్యాపారులకు రూ.1.45 లక్షల జరిమానాను విధించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విక్రేతలు తగు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ వ్యాపారాలు సాగించాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ లైసెన్స్‌ను విధిగా కలిగి ఉండాలని, లేని పక్షంలో రూ.10 లక్షల వరకు జరిమానాను విధిస్తామని స్పష్టం చేశారు. వివిధ హోటళ్లలో నిషేధిత రంగులను కలిపి ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రణతి ఫ్లోరా, నీరజ తదితరులు పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీని వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

నెల్లూరు (టౌన్): జీఎస్టీ విధానంలో నూతన టెక్నాలజీని వినియోగించుకోవాలని సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ కమిషనర్ ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్లో పారిశ్రామికవేత్తలు, ఆడిటర్లు, సర్వీస్ ప్రొవైడర్లు, ట్యాక్స్ కన్సల్టెంట్లతో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. కేంద్ర బడ్జెట్‌పై వారితో మాట్లాడారు. అనంతరం ఆడిటింగ్‌ను ఏ విధంగా చేయాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఆడిటర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను రేపటిలోపు జమచేయండి

ప్రస్తుత ఆర్థిక సంవత్సర ముగింపు సందర్భంగా పెండింగ్ జీఎస్టీ రిటర్న్‌ను ఫైల్ చేసి, జీఎస్టీ, వ్యాట్, ప్రొఫెషనల్ ట్యాక్స్, ఆడిట్, ఇన్‌స్పెక్షన్, స్క్రూటినీతో పాటు బకాయిలను ఈ నెల 31లోపు జమ చేయాలని నెల్లూరు డివిజన్ సంయుక్త కమిషనర్ రవీంద్రనాథ్‌రెడ్డి కోరారు. పన్ను చెల్లింపుదారుల సందేహాలను నివృత్తి చేసేందుకు గానూ జీఎస్టీ కార్యాలయంలో సిబ్బంది ఆది, సోమవారాల్లో అందుబాటులో ఉంటారని చెప్పారు.

రేపటి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

నెల్లూరు(క్రైమ్): నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేశామని జిల్లా పోలీస్ కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈద్ – ఉల్ – ఫిత్రను పురస్కరించుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది.

మూడు విద్యుత్ మోటార్ల చోరీ

వెంకటాచలం: మండలంలోని కసుమూరులో గల పంట పొలాల్లో మూడు విద్యుత్ మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. గ్రామానికి చెందిన రైతులు ఏనుగంటి ఏడుకొండలు, చెంచయ్య, మునెయ్య ఈ మోటార్ల ద్వారా తమ పంటలను పండించుకుంటున్నారు. పొలాల్లోకి శనివారం వెళ్లగా, ఇవి లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.